# వింతమార్పు

శ్రీమతి పుదూరు వెంకటమ్మాళ్లు గారు

'యేమేసుసీలా, వూరికే యెందుకే అల్లా ధుమధుమలాడుతుంటావ్?'వన్నాడు-లేసుఅల్లుతున్న భార్యనుచూచి_కాంతారావు.

సుసీల:—మరే!!నేనే యెప్పుడుచూసినా ధుమధుమలాడుకుంటూ, మెటికలు విరచికొంటూ, మూతిముడుచుకొంటూ అస్తమానం మీకు కనుపిస్తాను. పాపం! మీ అమ్మో? మూసినముత్యం పాసినపగడం!! ప్రొద్దుటినుంచి ఆవిడ అల్లా రాల్చిపోస్తూవుంటే మీకుచెవుడువచ్చిందా? అల్లారాల్చిపోయడానికి నే నేంజేశాను? అంట్లుతోవమంది. తోవనన్నాను. నాకేమికర్మం! అంట్లు తోమితేగాని నాకుసాగదా? అంట్లు తోమనన్నానని 'అయ్యో! గారాబాలకూచివే! నీవు పనిజేస్తావనుకొన్నానే తల్లీ! యేనాడైతే మా యింట్లోని కాలెట్టేవో ఆనాడే అనుకొన్నానమ్మా యెంతమాత్రం చేదోడువాదోడు కావని!!ఎల్లాఅనుకొన్నానో అల్లాగేచేస్తున్నావు. నీవే గనక పనిచేస్తే యీపాటికి సప్తసముద్రాలు యింకేపోయుండును. అయ్యో! నాబ్రతుకా యేకష్టము యెరగకుండా ఆ మహారాజు బాగానే దాటారు. నేను నీకు చాకిరీచేయటానికే యింకా బ్రతికున్నాను. రామ!! నేను యింటిచాకిరీ చేయలేక చచ్చిపోతున్నానుగదా!! చెట్టంతకోడలు చేతికంది యుంటేనాలాగేసుఖపడుతున్నారాఅంతాను. నాకే రామచంద్రమూర్తి చావన్నాబెట్టేయీపాటికి చచ్చినట్టే యింటిచాకిరీ అంతానేర్చుకొనేదాన'వని నోటికివచ్చినట్టు తిట్టి, వీరిని వారిని పిలచి నీకోడలు మంచిదికాదనియు ఒకపనికైనా సాయములేదనియు వీళ్ళకి పూటపూట వొండిపోయలేకపోతున్నాననిన్నీ బుడిబుడిదీర్ఘాలు పెట్టి అందరినోట్లో నన్ను పడేసింది. అంతా 'అయ్యో చిన్నదా చిత కదా లక్షణంగా యిల్లు చక్కబెట్టుకొనే యీడు'అని నోళ్లునొక్కుకొని వెళ్లేరు. నేనేమన్నా అనుకుంటానననేనా లేకుండా యిదేమన్నా బాగుందా? యేమన్నా అంటే మీకు కోపమొస్తుందికదూ, చాలాబావుంది!! నా ప్రాణంపోయినాసరే పనిచేయను.

కాంతారావు:—యెందుకే సుసీలా యింటనున్న కాపురము వీధిలో పెట్తావు? చెప్పు ఆవిడమాత్రం బలంగావుంటే యీ పాటికి పెదవి కదల్పకుండా చేసేదికాదుటే. పాపం బలంలేదు. నీవు సాయంచెయ్యవ్. యెల్లాచేస్తుంది చెప్పు. నీవు కొంచెం పని చేస్తే ఆవిడ ఓపికకి తగ్గపని ఆవిడచేసి నిన్ను అప్పుడే నంటపొయ్యిదగ్గిర పెట్టకుండా చేస్తుందే! ఏడాదిఅయింది కదా కాపరానికొచ్చి ఒక్కపనైనా చేస్తున్నావేమో నీవే చెప్పు. పోనీ పంజేసీదన్నా లేదుకదా మొన్న మొన్నటిదాకా యేదో యెప్పుడన్నాతోస్తే అలికిన యింటికైనా ముగ్గుపెట్టేదానవు. యిప్పుడదీలేదుగా!!యెంతసేపు నీకు నీషోకులతోనే సరిపోతోందిగదా! కొంచెం గూడ అయ్యో ఆపిడిచేసుకోలేదని నీకు తోస్తుంది. పక్కింటి రమణమ్మచూడు: పిల్లడుకూతురు పుట్టింటిలో యెంతైనాగారాబంగా పెరిగిందే!!

అవుతేమాత్రం అత్తారింట్లో సకలమైనపనులు చేసి భర్తకి అత్తగారికి కింద అరికాలుమోప కుండా చేస్తూంది. నీకేం!! వూళ్ళోవాళ్ళంతా పలాని కాంతారావు పెళ్లాము సుసీల అత్త గారిని యేడిపిస్తోందని చెప్పుకుంటుంటే చాలా తలవంపుగావుంది సుమా!!

సుశీల:—(కోపంతో) పాపం వూళ్లో వాళ్లంతా సుశీల సుశీల అని వూరికే అను కొంటున్నారంటూ రెందుకూ, నేజేసేది తప్పు పని అయితే అందరు గడ్డిపెట్టచ్చు. ఇదేం కర్మం అంట్లుతోమటం పేడచేయటం మా వాళ్లు నాకు నేర్పలేదు ఏంచేయమంటారు?

కాంతారావు:—అవన్నీ రెండుమాంతే యింకచేయాలసినపనులు యెన్నివున్నాయి చెప్పు.

సుసీల:—అయ్యో! యిదంతా నాపాపం కాబోలు; ఆడాళ్లెల్లాగో యేడుస్తారు. మధ్య మీకెందుకు పిల్లతల్లి బాగుండగా మంత్రసాని గండంలాగా మధ్య మీకేంకష్టం!!

కాంతారావు:—అయితే యింకా చేయా లసినపను లేవీలేవ్వా?

సుసీల:—లేకేం చాలావుంటాయి. నేను లేదన్నానా యేమిటి? వీధిలో వూడుస్తుంటే మావాళ్లెవరైనా చూశారంటే ఆక్షేపిస్తారు. ఫలాని మాధవరావుగారికూతురు సుశీల వీధి పాచిచేస్తుందంటే మాఅమ్మకి మానాన్నకి గాకుండా మాఅక్కలకీ అన్నలకీ ఒకటేమిటి అందరకీ అగౌరవమే.

కాంతారావు:—ఆడది యింట్లో పని చేసుకుంటే యింతమందికి అగౌరవమా?! యేంబావుంది.

సుశీల:—మధ్య మాటాడుతారెందుకూ చెప్పేదంతా పూర్తిగా వినండీ! యింక నీళ్ళు తోడాలంటే యీగుంటూరు నూతుల్లో నీళ్లు తోడలేనుబాబూ, ఒకవేళతోడేనా చేతు లెర్రగాబొబ్బలెక్కి పుళ్లవుతాయి. యింక బట్టలుతుకుతుంటే పక్కింటివాళ్లంతా కొత్తగా చాకలిదెవరైనావచ్చి బట్ట లుదుకు తోందా అనుకుంటారు. యింకగదు లూ డుస్తుంటే యెవరైనా చుట్టాలువచ్చారంటే ఏమండీ కావమ్మగారూ, ఈపనిజేసేమనిషిని యెప్పుడు కుదుర్చుకొన్నారండీ అంటారు. యిలాంటి చిక్కులు చాలావుంటాయ్ యిలాంటివివున్నప్పుడు యేలాగండీ చేయుడం అని ఓ లెక్చెరిచ్చేటప్పటికి

కాంతారావు ఆశ్చర్యపడి 'అయ్యో! సుశీలా నీవెంతయు వివేకంగలదానివి కాక పోడం నాపూర్వ జన్మపాపంసుమా? ఆడది యెంతమాత్రం యిల్లా ఆలోచిస్తూ వుండి యిల్లావుంటే కాపురాలు యెల్లా గట్టెక్కు తాయి చెప్పు? యెందుకే అల్లా ధుమధుమ లాడుతూ వుంటావన్నాననేకదా యింత మట్టుకువచ్చింది. పాపం మాఅమ్మనిచూస్తే యెల్లాంటివారికైనా జాలేస్తుందే! దానికితోడు చేదస్తంచేత ఒక్కొక్కపని ఒక్కొక్కగంట చేస్తూవుంటుంది. అల్లాంటప్పుడు పనికి ఓపిక లేక సాధిస్తుందంటే తప్పా? యింకైనా నా మాట వింటావా! వినవా?

సుశీల:—ఛీ!తీద్దుకూ నేర్చుకపోయారు. యెవరన్నావింటే నవ్విపోతారు!! నాకు వంద చెప్పండి వెయ్యిచెప్పండి నేను పనిచెయ్యనూ. అంతగామీకు భారంగావుండి సాధిస్తూ

వుంటారా పుట్టింటికెళతాను పంపెయ్యండి అంది సుసీల లోపలి కెళ్లుతూనూ.

కాంతారావు:—దీనికి చెపితేవినదు. మా అమ్మనందామనుకొంటే నానాచాకిరి చేస్తూ వున్నప్పుడు ఓపికలేక విసుక్కొంటేమాత్రం ఎందుకమ్మా అల్లావిసుక్కుంటావని నే నే మొఖంపెట్టుకొని అనను (అని ఆలోచించుకొంటూ)సంవత్సరంనించి యిల్లాయేడుస్తోంది కాపురం. యేవన్నా అంటే తిండితిందు; యేడుస్తుంది. ఆ ఇదిల్లావుంటే యెల్లాగాకాపురం చెయ్యడం!! నేను చెప్పడమేతప్పు. ఒకటీ దాని కెక్కటంలేదు. ఆతల్లిదండ్రి దరిద్రులు యిల్లాపెంచారు, వెధవపెంపకం!! (అని విసుక్కొని బంకెమీదవున్న కండువాతీసుకొని బయలుదేరాడెక్కడికో.)

కాంతమ్మగారు బయటనుంచి "సుసీలా! పెట్టెలో తెల్లపంచ యీలాపారే ఆరేస్తాను మడి కేమీ బట్టలులేవ్వా యేమీలేవు.అంది.

సుసీల:—పెట్టెలోనున్న తెల్లపంచెతీసి ఆవిడకాళ్ళదగ్గరకు విసిరేసింది. మల్లెపూవు లాంటి పంచెదుమ్ముచే నల్లబడిపోయింది.

కాంతమ్మకి దానిని చూడ్డంతోటే ఒళ్ళుతెలియని వెర్రికోపంతో, ఒసే. పొగరుబోతా, నీకేం పోయేగాలమువచ్చిందే మల్లెపూవులాంటి పంచ మట్టిలో మండబెట్టేవ్వా నీకు వళ్ళుతెలియటల్లేదేమిటే దౌర్భాగ్యురాలాయని కేకలువేసింది.

సుసీల:—ఏవిటమ్మా నేనేం జేశానని అల్లామాట్లంటారు. పంచపారెయ్యమన్నారూ పారేశాను. యిష్టంలేకుండావుంటే మాట్లాడ్డంమానెయ్యండి అంది.

కాంతమ్మగారు:—యేమే నంగనాచీ, తప్పువనిచేసి మళ్లీ పంచెపారేశాను, ఏతప్పు అంటావా? వుండు నీపొగరణుస్తా కాంతం రానీ అంటూ కోపంతో వెళ్లిపోయింది.

యింతలో కాంతారావువచ్చి జరిగిన సంగతిఅంతా విన్నాడు. సుశీల యెంతమాత్రము యింకవూరుకుంటే బ్రహ్మదేవుడికైనా సాధ్యమవ దనుకొన్నాడు. దండనచే పెంకితనము పోగడ్తామా అనాలోచించాడు. మళ్ళాఎందుకు ఇదో అల్లరికూడాను అనుకొన్నాడు. ఎవరిని యేవనకుండా తనగదిలోకి పోయి తక్షణం మామగార్కి వుత్తరం రాశాడు. మర్నాడు ప్రొద్దున్న మెయిల్‌లో సుసీలను పుట్టింటికి పంపాడు.

అక్కడ తనవదినగారు తల్లికిచేయు సపర్యలను కళ్ళారచూసింది. తనతల్లి కోడళ్ళపై చూపు ప్రేమాతిశయముకి ఆశ్చర్యపడింది. తనవదినగార్లు తనతల్లిని అత్తగారూయని నోరారబిలవడం అమ్మాయీ కామాక్షమ్మా సుందరమ్మాయని తనతల్లిపిలవడం తనవదినగార్లు కాపురముకి వచ్చింతరువాత యిదివరకున్న పాలేళ్ళనుతీయించి పేడవూడ్చుట మొదలగు పనులయందు ఎంతశ్రద్ధగావుండడం చూసింది. తక్షణమే సుశీలకి కొత్తవూహ తట్టింది. మునుపటిలాగా తల్లి తండ్రి ఎక్కువప్రేమగావుండక మామూలుగానే వుండుట గ్రహించింది. తనుకూడా దాసీయే కదా అనుకుంది. తనవదిన్లూ పుట్టింటగారాబంగా పెరిగినవారేకదా అనుకొంది.తనవదినల మీద తనతల్లి యెంతప్రేమగా చూస్తోందో

తమభార్యల సుగుణముల కెంత సంతోషిస్తున్నారో, తననిగూడా మంచితనముగావుంటే తినఅత్తగారు భర్త యెంతప్రేమగా వుండేవారో అనుకొని చాలాసిగ్గుపడింది. యిదివరకులాగా "న్నాళ్ళు పెంకితనంగావుంటే చేజేతులకాపురము కూలదోసుకొందును కదా అనుకొని చాల విచారించింది. యేముంది. భర్త సుశీల పట్టుదల చూడలేకపోతే పనిచెయ్యని ఆడదియెందుకని విడిచివేస్తే విడవవచ్చును. తక్షణమే తండ్రితో అత్తవారింటికి తీసుకెళ్ళమంది. సిద్ధంగానే వున్నాడు. కనక అప్పుడే రైలెక్కించి తీసుకువచ్చాడు. వెళ్ళగానే వత్తులుచేసుకొంటూ గోవిందనామము జపించుకొనుచుండిన ముదుసలి అత్తగారిని చూసింది. అత్తగారూ తెలియక చేసినతప్పులని క్షమించమంది. బుద్ధితక్కువచేత ఒళ్లుతెలియక మీకు అవచారపడ్డానని సాష్టాంగపడింది. అత్తగారు ఆశ్చర్యపడి అయ్యో నీవెందుకే దండంపెడతావు. నీవేమిచేశావే? అంతతప్పునాదే: చాల్లేవేలంది. సుసీలలేచి అత్తగారూ, అల్లా యెప్పుడు అనొద్దు; ఇవాళనించి అన్నిపన్లుచేసి వంటగూడా నేనే చేస్తానని గబగబ లోపలికివెళ్లి స్నానంచేసి వంటవండేసుకు కూర్చుంది మొగుడొచ్చేటప్పటికి. మొగుడాశ్చర్యపడి యేమేవ్ సుసీలా నీవు వంటజేస్తున్నావేమిటే యెవ్వరైనా చుట్టాలొచ్చారంటే ఏవండీ కాంతారావుగారూ వంటమనిషిని యెప్పుడు పెట్టుకున్నారండీ అంటారు" అని పకపకనవ్వాడు. సుసీల నవ్వుతూ చాల్లెద్దురూ ఎవరున్నా వింటే నవ్వుతా రంది. ముసలమ్మ మాకోడలికి నెలతప్పిందనిమురుస్తూంది.

# నిశ్చయము

కర్లపాలెం కృష్ణరావుగారు

[రవీంద్రుని 'గీతాంజలి' నుండి స్వేచ్ఛానువాదము]

౧

అస్మదీయాంగకములెల్ల, నతిపునీత
మయ్యె, నీ సజీవ స్పర్శనందియుంట,
గాన, ప్రాణంపు ప్రాణమా! ఏ నికెప్డు
అన్యమంటను, దేనికి నాశపడను.

౨

హృదయపీఠాన నిన్ బ్రతిష్ఠించుకొంటి
గాన, వికసించె ప్రేమప్రసూన, మింక,
చీకుచింతల నాదరి, జేరనీను
గానమొనరింతు తమిని నీలోన గలియ.

౩

నాయొనర్చు సమస్త యత్నంబులందు,
శక్తిసామర్థ్యముల నిచ్చి, జయము గూర్తు
వీవె, గావున, ప్రీతితో నెల్లపనుల
ప్రతిఫలింపగ జేతు,నిన్ ప్రౌఢిమెరయ.

౪

మంచిచెడుగుల గుర్తించి, సంచరింప,
నొక మహాపెల్గు నాలోననుంచి తీవు
గాన నికమీద కల్లలు కపటములను
తరిమివేసెద రానీక తలపులకును.